# త్రినాధుని బదిలీయాత్ర

**-చెన్నూరి రాంబాబు**

సాయంత్రం 5 గంటలకు కాజీపేట స్టేషన్ కిటకిటలాడుతోంది. అయితే సూట్‌కేసులు పట్టుకుని రైలు ఎక్కే ప్రయాణీకుల కన్నా చిన్న చిన్న హేండ్‌బాగులతో ఉన్న వారి నిట్టూర్పులతో, పలకరింపులతో సందడి సందడి గా ఉంది స్టేషన్.

"ట్రెయిన్ నెంబర్ 7407 తిరుపతి-హైదరాబాద్ కృష్ణా ఎక్స్‌ప్రెస్ మరికొద్ది క్షణాల్లో 3వ నెంబర్ ప్లాట్‌ఫారంపై వచ్చును" ఇలా శ్రావ్యంగా అనౌన్సర్ గొంతు మైక్‌లో విన్పిస్తుంటే ఆపసోపాలు పడుతూ స్టేషన్‌లో ప్రవేశించారు మూర్తీ అతని మిత్రబృందం.

"మిగిలిన ఫైల్స్ రేపు చూడొచ్చు. జయ'కృష్ణా' ముకుందా మురారి అని చెబుతూనే ఉన్నాను. మీరు విన్పించుకుంటేనా ఇప్పుడు చూడండి మనం వచ్చేసరికి ట్రెయిన్ వచ్చేస్తోంది. ముందా స్టేట్ బ్యాంక్ రమేష్ ఏ బోగీలో ఉన్నాడో చూడండి" ఓ పక్క రుసరుసలాడుతూనే తమ రెగ్యులర్ కంపార్ట్‌మెంట్ వద్దకు అందర్నీ తీసుకెళ్లాడు మూర్తి.

ప్రతీరోజూ ఇలా ఎంతోమంది ఉద్యోగులు బృందాలు బృందాలుగా హైదరాబాద్ నుంచి కాజీపేటకు 'అప్ అండ్ డౌన్' ప్రయాణం చేస్తూ ఉంటారు. వీరిలో చాలామంది పొద్దున్న 'ఈస్ట్ కోస్ట్' ఎక్స్‌ప్రెస్‌కు వచ్చి సాయంత్రం 'కృష్ణా'కు తిరిగి వెళుతూ ఉంటారు.

ఇలాంటి ఉద్యోగుల బృందాలలో ఓ ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్న మూర్తి మిత్రబృందం కూడా ఒకటి. అసలు ఇలా వచ్చే వారిలో ప్రభుత్వోద్యోగులే ఎక్కువ.

అలా 'అప్ అండ్ డౌన్' చేసే ఉద్యోగుల్లో మంచి సంఘీభావముంటుంది. ట్రెయిన్ లేటయితే ఒకళ్ల ఆఫీస్‌కి ఇంకొకళ్లు సమాచారాన్ని టెలీకాన్ఫరెన్స్ పెట్టుకొని మరీ అందజేస్తారు. ఒకళ్ల ఆఫీసుకి మరొకళ్లు వెళుతూ ఉంటారు. పరామర్శలు, పలకరింపులతో నిత్యం ఇలా కోలాహలంగా ఉంటారు. పొరపాటున ఎవరన్నా పనిచేసే చోటే కదా మరి నివాసం కూడా ఉండాలి అన్నారనుకోండి 'కోలాహలం' పోయి 'హాలాహలం' మింగుతున్నట్టుగా మొహాలు పెడతారు. ఇందులో ఎన్ని బాధలున్నాయో మీకేం తెలుసు అంటూ వీలు కుదిరనప్పుడు అడిగిన వాళ్లమీద విరుచుకు పడే ప్రయత్నాలూ జరుగుతాయి.

★★★

'బాస్ లేని ఆఫీస్ ఉత్తమురాలమ్మా'

అనుకుంటూ సరదాల సంబరాలతో ఓ ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తూ ఉంటారు మూర్తీ అతని సహోద్యోగులూ. 'ఆడుతూ పాడుతూ పనిచేస్తుంటే అలుపు సొలుపేమున్నది' అంటూ అందర్నీ ఉత్సాహపరుస్తూ ఉంటాడు కూడా. అయితే ఒకరోజున "త్రినాధరావు మనకి కొత్త బాస్‌గా రాబోతున్నాడోచ్" అంటూ మూర్తి చేసిన ఆ ప్రకటన ప్రశాంత సరస్సులో గులకరాయి విసిరితే అలలు వచ్చినట్లు ప్రకంపనలను సృష్టించింది.

త్రినాధరావు ఎలాంటి వాడో వారిలో చాలామందికి తెలుసు. కొంతమంది త్రినాధరావు సబార్డినేట్లుగా పనిచేస్తే మరి కొంతమంది అతని గురించి ప్రచారంలో ఉన్న కథల గురించి విన్నారు. ఇంతకీ త్రినాధరావు 'స్ట్రిక్ట్ డిసిప్లినేరియన్'గా పేరెన్నికగన్న వాడు. దాన్నెవరయినా అతిక్రమిస్తే గన్ తీయటానికి కూడా వెనుకాడని వాడు. సరదాల పరదాలు, నవ్వుల పువ్వులు ఏమాత్రం గిట్టనివాడు అన్న కథలు ప్రచారంలో ఉన్న నేపథ్యంలో మన పరిస్థితి ఏమిటి అన్న విశ్లేషణకు నడుం బిగించింది మూర్తి మిత్రబృందం.

"నేను త్రినాధరావుతో 15 ఏళ్ల క్రితం పనిచేశాను. అప్పుడతను డిసిప్లిన్‌తో హడలుగొడుతూ ఉండేవాడు. అయితే అప్పటికీ ఇప్పటికీ తేడా ఉండదంటారా" ప్రశ్నించాడు సీనియర్ అసిస్టెంట్ సుబ్బారావ్.

"అతను మాత్రం రేపు హైదరాబాద్ నుంచి 'అప్ అండ్ డౌన్' చేయకుండా హనుమకొండలోనే కామ్‌గా మకాం పెడతాడన్న గ్యారంటీ ఏముంది" సాలోచనగా అన్నాడు స్టోర్‌కీపర్ సుందర్రావు.

"ఆ అప్పుడంటే ఉరకలు వేసే ఉత్సాహం, ఏవో చేయాలన్న తాపత్రయం. ఇప్పుడు అతనూ 20 ఏళ్ల సర్వీసు పూర్తి చేశాడు. ఎవరయినా సరే అనుభవంతో అణిగిమణిగి ఉండాల్సిందే" అక్కౌంటెంట్ ఆంజనేయులు ఉవాచ.

"ఇంతవరకూ సాఫీగా గడిచిపోయింది. ఇంకో సంవత్సరం ఉంటే హైదరాబాద్ వెళ్లిపోవచ్చు అనుకుంటే మధ్యలో ఈ త్రినాధరావు గండం ఏమిటి బాబూ" ఆందోళనగా అంది స్టెనో వెంకటలక్ష్మి.

మొత్తానికి ఆఫీసంతా అదే విశ్లేషణ ఆ రోజంతా. కొత్తగా వస్తున్న బాస్‌ని విశ్లేషించటం అనేది ప్రతీ ఆఫీస్‌లో జరిగేదే అయినా త్రినాధరావు లాంటి వాడిని ప్రసన్నం చేసుకోవటం ఎలా? ఈ అప్ అండ్ డౌన్ ప్రయాణాన్ని నిరాటంకంగా కొనసాగించడం ఎలా? అనే ఆలోచనలతో సతమతమయ్యారు ఆ రోజు మూర్తి మిత్రబృందంతో పాటు మిగిలిన ఉద్యోగులు.

★★★

అందరూ ఆతృతతో ఎదురుచూస్తున్న ఆ రోజు రానేవచ్చింది. అందరి హర్షధ్వానాల మధ్య 'ఆఫీసర్ ఇన్‌చార్జ్'గా పదవీ బాధ్యతలు స్వీకరించాడు త్రినాధరావు. స్టాఫ్ చాలా మందిలో ఉన్న బెరుకు, భయాలను గమనించి చిన్నగా నవ్వుకున్నాడు.

ఒక్కొక్కళ్లను పిలిచి వాళ్లు హేండిల్ చేస్తున్న సెక్షన్లతో బాటు, ఎక్కడ ఉంటున్నారు 'లోకలా' లేక హైదరాబాదా, ఒకవేళ హైదరాబాద్ నుంచి వస్తుంటే ఎలా వస్తున్నారు. ఇలా అన్ని విషయాలూ పూసగుచ్చి మరీ తెలుసుకున్నాడు. దీంతోటి అందరూ కాస్త కంగారు పడినా నెల రోజుల వరకు ఉద్యోగుల 'అప్ అండ్ డౌన్' ప్రయాణీకులకు గానీ, ఆఫీస్ వ్యవహారాలకు గానీ ఎలాంటి ఆటంకాలు లేకుండా అంతా సాఫీగానే జరగటంతో 'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకున్నారందరూ.

★★★

"నే చెప్పలా! అనుభవమయ్యా, అది ఎలాంటి వాడినయినా మార్చేస్తుంది" మిత్ర బృందానికి భరోసా ఇచ్చాడు అక్కౌంటెంట్ ఆంజనేయులు.

అయితే అది తుఫాన్ ముందటి ప్రశాంతత అని అర్థం చేసుకోలేకపోయారు వారెవ్వరూ. పరిస్థితులు, ఆఫీస్ వాతావరణం, ఊరు ఇలా అన్నింటినీ

ఆకళింపు చేసుకోవటానికి త్రినాధరావు పెట్టుకున్న గడువు అది.

"ఇక మనం వర్రీ అవ్వాల్సిన పనిలేదు. తుఫాన్ మన దగ్గర తీరం దాటడం లేదు. నిశ్చింతగా ఉండొచ్చు" అని అందరూ అనుకుంటున్న సమయంలో ఒక సర్క్యులర్ జారీ అయింది.

అందరూ సాయంత్రం 6 గంటల 30 నిమిషాల వరకు ఆఫీస్‌లో ఉండాలనీ, ఆఫీస్‌కు రాకుండా 'డుమ్మా' కొట్టేవాళ్లు విధిగా సెలవు చీటీ ఇవ్వాలని దాని సారాంశం.

హుంకరిస్తూ తన 'హుకుం నామా'ను అమలులో పెట్టాడు త్రినాధరావు. ఈ 'ఆజ్ఞ'ల పరంపర ఇక్కడితో ఆగిపోలేదు. ఆఫీస్‌కు మెటీరియల్స్ సప్లై చేసే కాంట్రాక్టర్ల నుంచి చిన్న చిన్న స్టేషనరీ వస్తువులందించే షాపుల వారి వరకు ఎవర్నీ వదిలిపెట్టలేదు త్రినాధరావు.

తన అనుమతి లేకుండా ఎవరూ బయటివాళ్లతో మాట్లాడ్డానికి వీలు లేదన్న 'ఆంక్ష'ను తన 'ఆకాంక్ష'గా తెలియచేశాడు. బయటివాళ్లనందర్నీ తన 'గ్రిప్'లోకి తీసుకుని 'గిఫ్ట్'లు పొందటం మొదలుపెట్టాడు.

శివుడాజ్ఞ లేకుండా చీమయినా కొన్ని తప్పనిసరి పరిస్థితుల్లో కుడుతుందేమో కానీ, త్రినాధరావుకు తెలీకుండా మాత్రం చీమయినా బయటకు వెళ్లడానికి వీల్లేదు. ఇదీ ఆఫీస్ పరి(దు)స్థితి.

గొంతులో పచ్చివెలక్కాయ పడినట్టయింది మూర్తి బృందానికి. సాయంత్రం 6 గంటల తర్వాత హైదరాబాద్‌కు ట్రెయిన్ లేదు. మళ్లీ అర్ధరాత్రి వచ్చే గోదావరి, గౌతమిలాంటి ఎక్స్‌ప్రెస్ రైళ్లు తప్ప. పోనీ బస్సులో వెళదామంటే జర్నీ టైమెక్కువ.

మళ్లీ బోల్డంత ఖర్చు. త్రినాధరావు సర్క్యులర్‌తో బ్లడ్ సర్క్యులేషనే ఆగిపోతున్నట్టనిపిస్తోంది మూర్తి బృందానికి.

"లాభం లేదు త్రినాధస్వామి అభయం లేకపోతే మనం అనాథలమే కాబట్టి శరణు వేడక్క తప్పదు." సుందర్రావు పెట్టిన ఈ ప్రపోజల్‌ని ఏకగ్రీవంగా ఆమోదించింది మిత్రబృందం.

"సార్ మీరే మమ్మల్ని కాపాడాలి" అంటూ కాళ్లబేరానికి వచ్చిన మిత్రబృందాన్ని చూసి చిద్విలాసంగా నవ్వాడు త్రినాధరావు మిమ్మల్ని కాపాడితే నాకేమి లాభం అన్నట్టుగా.

"మీరు మాకు కనీసం కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో వెళ్లే వెసులుబాటు కల్పించండి. మేము దేనికయినా రడీ" ధైర్యం చేసి అన్నాడు మూర్తి మిత్రబృందం తరఫున.

ఈ అదును కోసమే ఎదురుచూస్తున్నాడు త్రినాధరావు. వెంటనే పదునైన తన ప్రపోజల్ వాళ్ల ముందుంచాడు.

"రెడీయా, అయితే వినండి. మీరు సీజన్ టికెట్‌కు ఎంతయితే ఖర్చు పెడుతున్నారో అదే సీజన్ నా దగ్గరా కొనాలి. అర్థం కాలేదా సీజన్ టికెట్ డబ్బులు నాక్కూడా కట్టాలి. అంతేకాదు మీకు కావల్సిన విధంగా మీరు 'లీవ్' పెట్టుకోవచ్చు" అంటూ చిన్న ఫాజ్ ఇచ్చాడు. దానిక్కూడా ఓ రేటుంది. అలాగే ఆలస్యంగా వచ్చినా కూడా" అర్థోక్తిగా నవ్వాడు త్రినాధరావు.

"సో డిసైడ్ చేసుకుని రేపు చెప్పండి" ఇక మీరు వెళ్లొచ్చు అన్నట్టు అందరి వంకా చూసి తన పనిలో మునిగిపోయాడు త్రినాధరావు.

త్రినాధరావు నిబంధనలకు బేజారయిన మిత్రబృందం అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసుకుంది.


"ఇదేమిటి బాసూ, గేరు రివర్సులో పడింది. అభయం ఇచ్చినట్టే ఇచ్చి అన్నిటికి బేరం పెట్టాడు మన బిగ్‌బాస్." అందరి మనస్సుల్లో తొలిచేస్తున్న ఆలోచనను బయటకు వ్యక్తం చేశాడు మూర్తి.

"త్రినాధరావు అంటే నిప్పు అనుకున్నాం కానీ ఇది మనల్ని కాల్చేసే నిప్పు" గొణిగాడు సుందర్రావు.

"కలికాలం బాబూ, అట్టే మాట్లాడితే ఆకలి కాలం.

ప్రస్తుతం అందరికీ ఏదో రకంగా సంపాదించుకోవాలన్న ఆకలి ఎక్కువయిపోయింది. వీళ్ల ఆకలికి బకరాలం మనం" ఆక్రోశించాడు ఆంజనేయులు.

ఉద్యోగంలో చేరిన కొత్తల్లో డిసిప్లిన్ పాఠాలు వల్లించాడేమో కానీ త్రినాధరావు ఇప్పుడు మాత్రం తన అవినీతి



## చివరి కోరిక

ముద్దాయిని కరెంటు కుర్చీలో కూర్చోబెట్టి శిక్ష అమలు జరపాలనుకున్నాడు జైలరు.

''నీ ఆఖరి కోరిక ఏమిటి?'' అడిగాడు జైలరు ముద్దాయిని.

''నాకు భయంగా వుంది. కరెంటు ఇచ్చినప్పుడు నన్ను గట్టిగా పట్టుకోవాలి'' అన్నాడు ముద్దాయి.

## దొంగగారు

''దొంగతనం చేశాడేమో పోలీసులు వీధుల వెంట లాక్కుని వెళుతున్నారు'' అన్నాడు సీను పక్కవాడితో.

''కాదురా బాబూ. ఆ దొంగ ఈ ఏరియాకి కొత్తట. పోలీసువారు ఈ ఏరియా అంతా పరిచయం చేయడానికి పిలుచుకు వెళుతున్నారు'' చెప్పాడు సాంబయ్య.

## కనబడుటలేదు

''మన ఫ్రెండ్ రమణ కనబడుటలేదని అన్ని పేపర్లలోనూ ఫొటోతోసహా ప్రకటించారు. వాడికెంత పేరు వచ్చింది?'' అన్నాడు రాజు ఆశ్చర్యంగా.


''క్రింద మరో ప్రకటన వుంది చదవలేదా? రమణను పట్టిచ్చినవారికి లక్ష రూపాయలు బహుమానం అని వుంది'' చెప్పాడు జాని.

## మరో జన్మ

''మరో జన్మలో కూడా మనిద్దరం భార్యాభర్తలుగా పుడదామండీ'' అంది భార్య.

''అయితే ఆ జన్మలోనైనా నా మాట వింటావు కదూ!''

**–ఎద్దుల శంకర నారాయణ**
(మదనపల్లె)




మాస్కని క్రమశిక్షణ నగిషీలతో చెక్కాడనిపించింది అందరికీ.

"ఇంతకీ త్రినాధరావు హనుమకొండలోనే ఇల్లు తీసుకొని ఫామిలీతో సహా తిష్ట వేస్తాడని ఎవరూహించారు మనలాగా 'అప్ అండ్ డౌన్' చేస్తాడనుకున్నాం కానీ'' నిట్టూర్చారు అందరూ.

మూర్తి బృందంతో పాటు రోజూ ప్రయాణం చేసే మిగిలిన ఉద్యోగులు సానుభూతి చూపించటం తప్ప మరేమీ చేయలేకపోయారు. వీళ్ల కష్టాలు విన్న తర్వాత ఆఫీసర్‌లోని మిగిలిన ఉద్యోగులు కూడా త్రినాధరావు 'పెన్నుపోటు' బారిన ఏదో రకంగా పడుతూనే ఉన్నారు.

★★★

పిల్లల చదువులు, భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేయటం, రెండు చోట్ల ఇళ్లు తీసుకుని సంసారాన్ని ఈదే స్థోమతు లేకపోవటం వంటి వివిధ కారణాల వల్ల 'అప్ అండ్ డౌన్' చేసే వీళ్లందరికీ త్రినాధరావు 'పన్నులపోటు' పోయేంతవరకూ లోటు బడ్జెటు మీద సంసారపు బండి నడవాల్సిందే. ఒకవేళ కాదు, కూడదంటే క్రమశిక్షణ చర్యల 'పెన్నుపోటు' తప్పదు అన్న త్రినాధరావు హెచ్చరికలు ప్రమాద సూచికల్లాగా కన్పిస్తున్నాయందరికీ.

★★★

"మా నాన్నగారు చాలా పెద్దవారు. ఆయన్నొకసారి హాస్పిటల్‌కు తీసుకువెళ్లాలంటే ఆదివారం తప్ప మిగిలిన రోజుల్లో కుదరడం లేదు.''

"మా వాడు పదో తరగతిలో ఉన్నాడు. పరీక్షలు దగ్గరకొచ్చేశాయి. ప్రతి చిన్న విషయానికి త్రినాధరావుకు ఫీజిచ్చుకోలేక చచ్చిపోతున్నాను.''

"మీకేం బాబూ, నేను పొద్దున్నే 4 గంటలకు లేచి వంట, టిఫిన్ అన్నీ సిద్ధం చేసి టేబిల్ మీద అన్నీ అమర్చి ట్రెయిన్ ఎక్కాలి.''

"మనమేదో అప్ అండ్ డౌన్ చేస్తూ హాయిగా ఎంజాయ్ చేస్తున్నట్లుగా మాట్లాడుతున్నారందరూ. ఉన్నంతసేపు నిమిషం వేస్ట్ చెయ్యకుండా పనిచేస్తావని గుర్తించరెవ్వరూ. పైగా మనమీద మిగిలిన స్టాఫ్ అంతా జోకులు'' ఇలా వాపోయారు పాపం అందరూ.

ఇలా ఎవరి సమస్యల చికాకులు వారికి ఉండగా ఆఫీస్‌లో త్రినాధరావు అందరినీ తనదైన శైలిలో ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాడు. ఈ కష్టాల కడలిని ఈదుతూ హైదరాబాద్ తీరం రోజూ చేరటం ఇబ్బందిగానే పరిణమించింది మూర్తి బృందానికి.

★★★

"ఈ పరిస్థితి లోంచి బయటపడలేమా'' ప్రశ్నించాడు మూర్తి. "పోనీ మనం కంప్లెయింట్ చేస్తేనో త్రినాధరావు అవినీతి భాగోతాన్ని బట్టబయలు చేస్తూ'' చాచి లెంపకాయ కొట్టాలన్నంత కసితో అన్నాడు సుందర్రావు.

"మనం ఎక్కడ ఉద్యోగం చేస్తే అక్కడుండాల్సిన వాళ్లం. కానీ మాది ఉద్యోగం ఒకచోట, సంసారం ఒకచోట. దీంతోటి నైతికంగా ఆ హక్కును కోల్పోయామోనని అనిపిస్తోంది'' అనుభవజ్ఞుడైన అక్కౌంటెంట్ ఆంజనేయులు ఫైనల్ రిమార్క్‌తో చర్చకు తెరపడింది.

ఇటు అందిన చోటల్లా 'దండుకోవడం' ఎక్కువయిన త్రినాధరావు 'ప్రతిభాపాటవాలు', ఉద్యోగుల అసంతృప్తి జ్వాలలు సెంట్రల్ ఆఫీస్ కెగశాయి.

★★★

"బాసూ, తాజా ఖబర్! సెంట్రలాఫీస్ నుంచి ఇన్‌స్పెక్షన్‌కి డెప్యూటీ డైరెక్టర్ జనరల్ వస్తున్నాడు'' అంటూ ఇంకా ఆఫీస్‌లో పూర్తిగా సెటిల్ కాకుండానే మూర్తి అందించిన ఈ వార్త, బాగా రష్‌గా ఉన్న ట్రెయిన్‌లో ఎక్కగానే సీటు దొరికినంత ఆనందం కలిగించింది అందరికీ.

ఆఫీస్‌లో అంతా జరగబోయే తతంగానికి ముహూర్తపు షాట్ కోసం ఎదురుచూస్తున్నారు.

★★★

ఊహించినట్టుగానే స్టాఫ్‌తో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశాడు త్రినాధరావు. వచ్చే డి.డి.జి.తో అందరూ జాగర్తగా మసులుకోవాలని హెచ్చరించాడు. ఒక్కమాట ఎక్స్‌ట్రా మాట్లాడితే ఊరుకోనన్నాడు. అట్టే మాట్టాడితే వంచిన తల ఎత్తకూడదన్నాడు. ఆయన గౌరవార్థం ఇచ్చే పార్టీ కోసమని ప్రతి ఒక్కరు 100 రూపాయలు గిఫ్టు పన్ను కట్టాలన్నాడు. ఇదెక్కడి గొడవరా బాబు అనుకుంటూనే వచ్చే డి.డి.జి. తమ సమస్యల గుచ్ఛాన్ని ఎలా అందించాలా అని మదనపడసాగారు.

ఎదురుచూసిన ఆ శుభఘడియ రానే వచ్చింది.

డి.డి.జి. జైస్వాల్స్ ఎవరి కంటా పడకుండా మేనేజ్ చేసి ఎయిర్‌కండిషనర్ చల్లదనంలో తను వచ్చిన తర్వాత స్టాఫ్‌లో పంక్చుయాలిటీ ఎలా పెంచిందీ, పని సంస్కృతి ఎలా వెల్లివిరుస్తుందో''

లాంటి వెచ్చని వార్తలతో ఆయనని చల్లబరిచే ప్రయత్నం చేశాడు త్రినాధరావు.

'అప్ అండ్ డౌన్' మిత్ర బృందానికి మాత్రం ఆ ఉన్నతాధికారిని విడిగా కలిసే అవకాశం ఇవ్వకుండా మొక్కుబడి 'టీ' కార్యక్రమాన్ని ఒక్కటే ఏర్పాటు చేశాడు త్రినాధరావు.

అన్నీ తానే అయిన అన్నింటా తాను ఉండి అందరి తరఫునా వకల్తా పుచ్చుకొని మాట్లాడాడు. ఇవన్నీ డి.డి.జి. గమనించకపోలేదు. స్టాఫ్ కళ్లలోని మూగభాషను విశ్లేషించే ప్రయత్నం చేయకపోలేదు.

***

అందర్నీ 'సర్‌ప్రైజ్' చేస్తూ 'ప్రైజ్' పొందిన ఆనందం ఫీలవుతూ జైస్వాల్‌ని తన ఇంటికి లంచ్‌కు తీసుకెళ్లాడు త్రినాధరావు. తనకు నమ్మకస్తులైన ఇద్దరు స్టాఫ్ మెంబర్ల సమక్షంలో ఘనంగా సత్కరించి శాలువా కప్పి స్టాఫ్ తరఫున కొన్ని మెమొంటో అందించాడు.

తను మాత్రం మూడో కంటికి తెలియకుండా సెంట్రల్ డైరెక్టర్‌ని విజయవంతంగా సాగనంపి 'చక్కటి సహకారాన్నందించారు' అంటూ స్టాఫ్ అందరికీ ధన్యవాదాలు తెలియజేశాడు. చూశారా జైస్వాల్‌ని ఎలా బుట్టలో వేసుకున్నానో, మీ అసంతృప్తి అంతా బుట్టదాఖలే అనే విజయగర్వం కనిపించింది త్రినాధరావు మాటల్లో.

మళ్లీ కథ కంచికి చేరిందన్న నిరాశా నిస్పృహలు చోటు చేసుకున్నాయి వారందరిలో.

***

ఇది జరిగిన 15 రోజులకి త్రినాధరావు ట్రాన్స్‌ఫర్ వార్త ఆఫీసంతా దావానలంలా వ్యాపించింది. ఒక పక్క ఆనందం ఇంకోపక్క ఇది నిజమేనా అని అందరూ తలమునకలవుతున్న సమయంలో "జోరుగా, హుషారుగా షికారు పోదామా" అంటూ వచ్చాడు మూర్తి.

"పాటాపి మా పాట్లు చూడు" గుర్రుమన్నాడు సుందర్రావు.

"ఇంతకీ 'త్రినాధుడి బదిలీ యాత్ర' గురించేగా మీ అందరి సందేహం" చిద్విలాసంగా నవ్వి మొదలు పెట్టాడు మూర్తి.

"మీకు గుర్తుండే ఉంటుంది. సెంట్రల్ ఆఫీస్ నుంచి వచ్చిన డి.డి.జి. జైస్వాల్‌ని లంచ్ కోసమని తనింటికి తీసుకెళ్లాడు త్రినాధరావు. ఇంతకీ త్రినాధరావు ఇల్లు మన ఆఫీస్‌కు నడిస్తే 5 నిమిషాల దూరం కూడా లేదు. కానీ ఆయన నెలకు వెయ్యి రూపాయల ట్రాన్స్‌పోర్టు అలవెన్స్ తీసుకుంటున్నాడు. మరి ఈ రవాణా భత్యం తీసుకోవాలంటే రూల్స్ ప్రకారం ఆయనిల్లు ఆఫీస్‌కు కనీసం 1 కిలోమీటర్‌కు మించిన దూరంలో ఉండాలి. త్రినాధరావు ఆఫీస్‌కిచ్చిన డిక్లరేషన్ ప్రకారం 2 కిలోమీటర్ల దూరంలో ఉంటున్నాడు. కానీ నిజంగా ఆఫీస్‌కి కూతవేటు దూరంలో మాత్రమే ఉంటున్నాడు. ఇలా అత్యాశకు పోయి సెంట్రల్ ఆఫీసు నుంచి వచ్చిన డి.డి.జి.ని తనింటికి తీసుకెళ్లి తన ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ తానే 'పుటప్' చేసుకున్నాడు పూర్ త్రినాధరావు.

ఒక ఆఫీస్‌కి ఇన్‌చార్జ్‌గా ఉండి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సింది పోయి ప్రభుత్వాన్ని మోసగించినందుకే ఈ ట్రాన్స్‌ఫర్. స్టాఫ్‌ని క్షోభ పెడుతున్నాడన్న ఫిర్యాదులు ఎలానూ ఉన్నాయి. ఇన్నాళ్లు మనకి తెలియని విషయం ఇంకో టుంది." ఒక్క క్షణమాగి ఊపిరి పీల్చుకున్నాడు మూర్తి. ఒకింత ఉత్కంఠను పెంచాడు అందరిలోనూ.

"త్రినాధుడి అవినీతి ఇంతింతై మర్రిచెట్టులా విస్తరించి ఆఫీస్ ఉనికికే ప్రమాదం ఏర్పడిన సందర్భం సెంట్రలాఫీసు నుంచి ఈశాన్య భారతానికి ఈసురోమంటూ వెళ్లాల్సిన త్రినాధరావు పైరవీ ప్రాణవాయువుతో ఊపిరోసుకుని ఇక్కడకొచ్చాడు.

ఇలా వ్యవస్థనే దెబ్బతీసిన త్రినాధుణ్ని 'ఈశాన్య మాన్యాలు' పట్టించి అవస్థల పాల్జేయాలని అవకాశం కోసం ఎదురుచూస్తున్న సెంట్రలాఫీసుకు ఇది సువర్ణావకాశంగా మారింది. అయితే ఇదంతా పూసగుచ్చినట్లు నాకు ఎలా తెలుసనేగా మీ సందేహం. పూర్వాశ్రమంలో నేనూ, జైస్వాల్ సహాధ్యాయులం. ఇద్దరం యు.పి.ఎస్.సి. పరీక్ష కోసం ఒకేచోట కోచింగ్ తీసుకున్నాం. కాలం కలసిరాక నేను యు.డి.సి. అయితే అతను క్లాస్ 1 ఆఫీసరయ్యాడు. ఆ పాత పరిచయాన్ని పునరుద్ధరించి త్రినాధరావు గుట్టంతా విప్పాను నేను. సో అలా తీగలాగితే త్రినాధరావు బదిలీ వార్త బయటకు వచ్చింది." అర్థ నిమీలిత నేత్రాలతో విషయాన్ని వివరించి అందర్నీ విస్మయపరిచాడు మూర్తి.

'లాభం లేదు. ఈ మధుర క్షణాలలో మధురమైన పాటందుకోవాల్సిందే' అని మూర్తి అనబోతుంటే-

'ఉందిలే మంచి కాలం ముందు ముందునా, అందరూ సుఖపడాలా నంద నందనా' ఈసారి పాట అందరూ అందుకున్నారు.

★

## చేపల అరుపులు

చేప కేకలు విన్నారా మీరెప్పుడైనా? ఛీ! ఊర్కోండి. చేపలేమిటి? అరవడం ఏమిటి? అంటూ నవ్వకండి. నిజం. చేపలు కూడా అరుస్తాయి. 1953వ సంవత్సరం వరకూ ప్రపంచ మేధావులంతా చేపలకు శబ్దాలు చేయడం రాదనే అనుకున్నారు గానీ బోస్టన్ యూనివర్సిటీకి చెందిన ఫిలిప్స్ యస్ లోబెల్ అన్న పరిశోధకుడు చేపలు కూడా శబ్దాలు చేస్తాయని కనుగొనడంతో ఒక్కసారి ప్రపంచమంతా విస్తుపోయింది. సహజంగా సముద్రపు హోరులో చేపలు చేసే ఈ శబ్దాలు సముద్రంలో ఈతకొట్టేవారి చెవులకు వినపడవు. అయితే అక్వేరియంలో ఉండే చేపల అరుపులైనా మనకు వినిపించాలి కదా! మరి మేమెప్పుడూ అక్వేరియం దగ్గర కూడా చేపల శబ్దం వినలేదే అంటారు. అంతేనా? ఈ ప్రశ్నకు పరిశోధకుల సమాధానం ఏమిటంటే చేపలు చేసే ఈ శబ్దాలను గ్రహించగల శక్తి మన చెవులకు లేదని, అందుకే ఒక స్పెషల్ మైక్రోఫోన్ ఒకటి రూపొందించి చేపలు చేసే లో ఫ్రీక్వెన్సీ శబ్దాలను మైక్రోఫోన్‌ల ద్వారా గ్రహించి ఆ ధ్వనుల్ని యాంప్లిఫియర్‌లా పెంచి వాటిని వినేందుకు అనువైన ఏర్పాట్లు చేసినప్పుడు ఎన్నో వెరైటీల శబ్దాలు వినిపించాయి. టోడ్ ఫిష్... సంపర్క సమయంలో చాలా విచిత్రమైన ఈల శబ్దాలు చేస్తాయి. హోమెర్ ఫిష్ బీప్‌బీప్‌మనే శబ్దాలు చేస్తే మరికొన్ని రకాల చేపలు ఆనందంగా నీటిలో గంతులేసేప్పుడు, తలుపులు మూసేటప్పుడు వినిపించే లాంటి శబ్దాలు చేస్తాయి. ఈ స్పెషల్ మైక్రోఫోన్‌ను మన ఇళ్లలో ఉండే చేపల తొట్టెలో అమర్చినా చేపల అరుపులు వినొచ్చు!

—శశి

